# 6

# సిరికిం జెప్పడు....

బయట పుల్ల చినుకులు పడుతున్నాయి. ఈదరుగాలి సయ్యిన మంటూ లోపలికి దూసుకొస్తూ ఉంది!

రమణయ్య మేష్టరు కిటికీ తలుపులు మూసి, మెడదాకా దుప్పటి కప్పుకొని, మంచంలో ముడుచుకు పడుకొన్నాడు. బయటి వాతావరణంలాగే అతని మనస్సు కూడా చిరాగ్గా ఉన్నది. శ్రీదేవి వొకటి రెండుసార్లు, ఆ గదిలో కొచ్చింది. వచ్చినట్లు రమణయ్యకు తెలుసు. తెలిసినా అతను భార్యను పలకరించలేదు. అనేక రోజుల నుండీ మనస్సులో పేరుకు పోయిన కోపమంతా కట్టలు తెంచుకొని పైకి రాసాగింది. ఈ కార్యక్రమం నిన్ననే ప్రారంభమయింది. ఎప్పటికి ముగుస్తుందో తెలీదు.

ఇప్పటికీ ఆవిడ తన ధోరణిని మార్చుకోలేదు. తనది పొరబాటని వొప్పుకోనూ లేదు. ఇందిర జాతకం బ్రహ్మాండమైనదనీ, మాంచి కుర్రవాడెవడో వచ్చి, దాన్ని ఇట్టే ఎగరేసుకు పోతాడని ఆయనకో గట్టినమ్మకం. ఆ నమ్మకానికి ఆధారాలేమిటో రమణయ్య మాష్టరుకి ఈ నాటికీ తెలీవు.

ఆయన ఇందిర కోసం చాలా సంబంధాలు చూశాడు.

నచ్చిన వేవీ రాలేదు. వచ్చిన సంబంధాలు నచ్చనూ లేదు. మంచి సంబంధం వచ్చిందాకా ఊరికే ఉండటమెందుకని చది వించాడు. చదువుకొన్న పిల్లకు పెళ్ళనేది ఓ సమస్య కాదను కొన్నాడు. "కాలం మారిపోతూ ఉంది. ఇహ ముందుముందు డబ్బే పరమార్థంగా చూసుకొనే వాళ్ళు ఉండక పోవచ్చు" అనేవా డాయన. కానీ, ఆయన అంచనాలు తప్పని రుజువవు తున్నాయి. చదువుల ఖర్చుకు రెండు మూడింతలయినా చెల్లించుకోనిదే, అనువయిన కుర్రవాడెవడూ దొరకడం లేదు.

పోనీ - ఇందిర ఏ కుంటిదో, గుడ్డిదో అనాకారో ఐతే- అనుకోవలసిం దేమీ లేదు. అనకూడదు గానీ తన కూతురు బంగారబ్బొమ్మ. చిదిపి దీపం పెట్టవచ్చు. పైగా చదువుకొంది కూడానూ. అయినా దాని వెనక్కాతల, ఏ పది పది హేను వేలో ఉంటే తప్ప, ఆనాలుగక్షింతలూ పడవు. అప్పటికీ - అంతంతమాత్రపు సంబంధాలే దొరుకుతాయి. తనకు అన్ని విధాలా నచ్చిన అల్లుడే దొరకాలంటే-అధమపక్షం, తన ఆస్థిని అయిదారు సార్లన్నా అమ్మవలసి ఉంటుంది. పిల్లేమో నచ్చిం దంటారు. సంప్రదాయం మంచిదే నంటారు. కానీ - కట్నం మాట కొచ్చేసరికి, జావ లాగా జారిపోతున్నారు. ధోరణి చూస్తుంటే ఈ తరం వారికి డబ్బుయావ తప్ప మరొక టేదీ ఉన్నట్లు కనిపించడంలేదు.

ఏమయితే అదే అవుతుందని, ఇందిరను ఉద్యోగంలో చేర్పించాడు తను. శ్రీదేవి వొద్దు మొర్రోమని గోలపెట్టింది.

అయినా తను వినలేదు. ఆ మాటే శ్రీదేవి దెప్పి పొడిచింది కూడాను. "అప్పుడు నేను నెత్తీనోరూ కొట్టుకొని చెప్పాను. నన్ను తుస్కారించి పారేశారు. ఇప్పుడు కొంపమీది కొచ్చింది. సంసారాన్ని నడివీధిలో పెట్టారు. ఇకేం చేస్తారో చెయ్యండి" అని కుమలపొడిచింది శ్రీదేవి.

తను కిక్కురు మనలేక పోయాడు. ఇందిర అప్పుడప్పుడు పొద్దుపోయి ఇంటికొస్తుందని, ఆవిడ గోలకెత్తినప్పుడు తను వినిపించుకోలేదు. ఈ చాదస్తాలన్నీ కట్టిపెట్టమని కేకలేశాడు. చివరికి ఆవి డన్నదే నిజ మయింది.

"వాసు చాలా మంచివా"డని ఇందిర చాలాసార్లన్నది. ఆ మంచితన మేమిటో నిన్నటితో తేలిపోయింది. తను వెళ్ళి వాసు తండ్రితో మాట్లాడాడు. "కూతుర్ని ఎరచూపి ఆస్థి కాజేదామని చూస్తున్నావుటయ్యా?" అని దులిపేశా డతను. తన ప్రాణం బక్క చచ్చిపోయింది. ఇంకో సందర్భంలోనైతే, అతన్ని నిలువునా చీల్చి ఉండేవాడు. కానీ తను కార్యార్థియై వచ్చాడు. ఈ సమయంలో ఆగ్రహం అసలే పనికిరాదు. అందుకనే పెల్లుబేగిపోతూ ఉన్న కోపాన్నంతా దిగమింగుకొని, మరొకసారి అసలు విషయాన్నంతా చెప్పాడు. తనింతగా ప్రాధేయ పడుతున్నా వాసు మాట్లాడలేదు. కనీసం - తన పట్ల సానుభూతిగా చూసిన పాపాన్నయినా పోలేదు. ఇందిర మాటల ప్రకారం, వాసు చాలా యోగ్యుడు. ఎంతో ధైర్య సాహసా లున్నవాడు - అవన్నీ నిజమే ననుకొన్నాడు తను

కూడా. తనెంత భ్రమపడిందీ ఇప్పటికిగాని తెలియలేదు. అంతటి అవమానాన్ని గుండెల్లో దాచుకొని తనెలా ఇంటి కొచ్చాడో కూడా జ్ఞాపకం లేదు.

తలంతా నొప్పితో పేలిపోతూ ఉంది. కణతలు లోపలికి నొక్కుకు పోతున్నాయి. తనొచ్చేసరికి ఇందిర నిద్రపోతూ ఉంది. అమాయికమైన ఆ ముఖాన్ని చూస్తుంటే – ఆయనకు కోపమూ, జాలి కూడా కలిగాయి. ఈ రొమ్ముమీది కుంపటిని ఇలా ఎంతకాలమని భరించడం? దీనికొక్కటే పరిష్కారమార్గ ముంది. ఆ మార్గాన్నే తనవలంబించాడు.

వంటింట్లోంచి శ్రీదేవి కెవ్వుమని అరచింది. ఆ కేకతో రమణయ్య మాష్టరు వొణికిపోయాడు. అతనికి ముచ్చెమటలు పోశాయి. దుప్పటి తలమీదుగా లాక్కుని, గువ్వలాగా మంచంలో చుట్టుకుపోయాడు.

"అమ్మాయి ఉన్నట్టుండి విరుచుకు పడిపోయిందండీ! ముఖమంతా పాలిపోయింది. నురుగులు కక్కుతున్నది. బంగారంలాంటి బిడ్డకిలా వచ్చిపడిందేమిట్రోయ్ దేవుడా!'' అని అల్లాడిపోయింది శ్రీదేవి.

ఇందిర అలా ఎందుకు పడిపోయిందో రమణయ్య కొక్కడికే తెలుసు. అయినా అతనా విషయాన్ని భార్యతో చెప్ప లేదు. దిండులో ముఖం దాచుకొని భోరుమని ఏడ్చాడు.